

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేనిదని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలియజేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలనే త్యాగం చేశారన్నారు. ఆయన త్యాగ ఫలితమే 1956 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. పటేల్ స్వాతంత్ర సమరయోధుడి గాక సంస్థానాలను భారతదేశంలో విలీనం కావడానికి గట్టిగా కషి చేశారన్నారు. ఉప ప్రధానిగా, హెూం మంత్రిగా ఎన్నో సేవలు అందించారన్నారు. ఇలాంటి వారి జీవితాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



కళ్యాణదుర్గంలో సంకల్ప సిద్ధి ఏజెంట్ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

ముంచేసిన 'సంకల్ప సిద్ధి'

కమీషన్ల ఆశ చూపి 'సంకల్ప సిద్ధి' ప్రజలను ముంచేసింది. కోట్లాది రూపాయలను వసూలు చేసుకుని ఆ సంస్థ ప్రతినిధులు ఉడాయించారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇందులో డిపాజిట్లు చేసిన బాధితులు తమకు న్యాయం చేయండి అంటూ పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో చూస్తే కళ్యాణదుర్గం డివిజన్ ప్రాంతంలోనే కోట్లాది రూపాయలను డిపాజిట్లు పెట్టి ప్రజలు నష్టపోయారు. ఈ ప్రాంతంలో సంకల్ప సిద్ధి ఏజెంట్లు, బాధితులు ఎక్కువగా ఉండడంతో పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా సంకల్ప సిద్ధి బాధితులు ఎవరైనా ఉంటే కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌లో తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలంటూ గురువారం నాడు డీఎస్పీ శ్రీనివాసులు విలేకరులకు తెలియజేశారు.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సంకల్ప సిద్ధిని మొదలు పెట్టిన సమయంలో దీనికి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మొదట్లు డిపాజిట్లకు వెంటవెంటనే కమీషన్లను అందించి చెల్లింపులు చేశారు. దీంతో చాలా మంది దీనిపట్ల ఆకర్షితులు అయ్యారు. ముఖ్యంగా కొందరు ఉద్యోగులు దీనిలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, ఏజెంట్లుగా మారి ప్రజలతో డబ్బులు వసూలు చేశారు. ఉద్యోగులే మార్టులో లక్షలాది రూపాయాలు వెచ్చించడంతో వారిని నమ్మి సామాన్య ప్రజలు సైతం పెట్టుబడులు పెట్టారు. ఉన్నఫలంగా మార్ట్ యాప్ బంద్‌కావడంతో ఆసలు మోసం బట్టబయలైంది. సంకల్ప సిద్ధి మార్టు నిర్వహకులను విజయవాడలో అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. దీంతో బాధితులు తామంటేతాని, ఏజంట్లను నమ్మి పెట్టుబడులు పెట్టామని పోలీసులను ఆశ్రయించారు. ఇలా ఉమ్మడి జిల్లాలో చూస్తే ఒక్క కళ్యాణదుర్గం డివిజన్ ప్రాంతంలోనే సంకల్ప సిద్ధి సుమారు రూ.50కోట్ల వరకు లావాదేవీలు నడిపినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో కొంతమంది ఉద్యోగస్తులు ఏజెంట్లు మారి లక్షలాది రూపాయాలు అర్జించి విలాసాలు ప్రదర్శించారు. వీరిని చూసి సామాన్యులు ఇందులో పెట్టుబడులు పెట్టారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులే ఇందులో వందలాది మంది ఏజెంట్లుగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా వారు డబ్బులు కట్టించుకున్న వారికి ఆ సొమ్మును వెనక్కు ఇచ్చేసినట్లు సమాచారం. మరికొందరు తామూ మోసపోయామని ఈ పరిస్థితులు మేము ఏమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కళ్యాణదుర్గం పట్టణంలో నివాసముంటున్న ఓ ఉపాధ్యాయుడి ఇంటి వద్ద వందలాది మంది బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ డిపాజిట్ మొత్తాన్ని వెనక్కు ఇవ్వాలంటూ నిలదీశారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. బాధితులు అందరితోనూ పోలీసులు మాట్లాడి డిపాజిట్లకు సంబంధించిన తగిన ఆధారాలను తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

సంకల్ప సిద్ధి మార్ట్ బోర్డు తిప్పేసిన తరువాత ఒక్క కళ్యాణదుర్గం ప్రాంతంలోనే వేలాది మంది బాధితులు రోడెక్కారు. తమకు న్యాయం చేయండి అంటూ పోలీస్ స్టేషన్లను ఆశ్రయించారు. సంస్థకు చెల్లించిన మొత్తంతో సహా మోసపోయిన తీరును పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందిస్తున్నారు. పూర్తి ఆధారాలు ఉన్న వారిని పోలీసులు తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

మోసం ఇలా..

- సంకల్ప సిద్ధి మార్టులో రూ.1000 డిపాజిట్ చేస్తే రోజుకు రూ.10 కమీషన్, నెలలోపు రూ.300విలువ చేసే కిరాణ సరుకులు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు.
- రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు రూ.1000 ప్రకారం 300రోజుల్లో రూ.3లక్షలు ఇస్తామన్నారు. తనఖాతా ద్వారా సభ్యులను చేర్పిస్తే అధనకంగా కమీషన్ జమవుతుంది.
- రూ.లక్ష చెల్లిస్తే రూ.లక్ష విలువైన బంగారం, ఇస్తామన్నారు. దీంతో పాటు రోజుకు రూ.100 చొప్పున 300 రోజులు రూ.30వేలు ఇస్తామని మొబైల్‌కు మేసేజ్‌లు పంపించారు.
- రూ.25 లక్షలు చెల్లిస్తే 25 ఎర్రచందనం మొక్కలతో కూడిన స్థలం ఇస్తామన్నారు. దీంతో 15 ఏళ్లలో రూ.1.75 కోట్లు వస్తాయని నమ్మబలికారు.
- రూ.5 లక్షలు చెల్లిస్తే సెంటు స్థలం, 300 రోజుల తరువాత రూ.25లక్షలు చెల్లిస్తామని చెప్పారు.



కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్ వద్ద ఉన్న సంకల్ప సిద్ధి బాధితులు

కళ్యాణదుర్గంలో ఫిర్యాదు చేయండి : డీఎస్పీ

అనంతపురం జిల్లా వ్యాప్తంగా సంకల్ప సిద్ధి మార్ట్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మేరకు ఆయన గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాధితులు ఎవరున్నా వారు ఎంత మొత్తంలో డిపాజిట్ చేశారు.? ఎవరికి చెల్లించారు.? అన్న వివరాలను ఆధారాలతో సహా ఇవ్వాలన్నారు. ఇప్పటికే చాలా మంది ఫిర్యాదులు చేశారని, వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. బ్రహ్మసముద్రం మండలం సుగేపల్లికి చెందిన నరేష్ రూ.3.16లక్షలు, పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు గోవిందరాజులు రూ.5లక్షలు మోసపోయినట్లు ఆధారాలతో సహా ఫిర్యాదు అందిందన్నారు. ఇంకా జిల్లాలో సంకల్ప సిద్ధి ద్వారా మోసపోయిన బాధితులెవరైనా ఉంటే ఆధారాలతో కళ్యాణదుర్గం సిఐ తేజోమూర్తికి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలియజేశారు.

'చెత్త' నిర్ణయం..!

- ప్రజలపై దొడ్డిదారిన పన్నుల భారం
- మహిళా సంఘాల ద్వారా తీర్మానం
- అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం ప్రజలపై ఏదోక రూపంలో భారం మోపేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే నేరుగా వేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో దొడ్డిదారిన మోపేందుకు సిద్ధమవుతోంది. ప్రజల అంగీకారం ఉందని చూపేందుకు కొత్తఎత్తు వేశారు. అనంతపురం నగర పాలక సంస్థలో మహిళా సంఘాల ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇది వరకే నగరంలో కొన్ని ప్రాంతాల్లో హౌస్‌టుహౌస్ చెత్తసేకరణ ప్రారంభం పేరుతో వలంటీర్ల చేత చెత్తపన్ను వసూలుకు ప్రయత్నాలు చేపట్టారు. దీనిపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. అప్పటి నుంచి కొంత వెనుకడుగు వేసినట్టు కనిపించారు. తిరిగి ఇప్పుడు చెత్తపన్ను వసూలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇంటికి రెండు చెత్త బుట్టలను అందజేశారు. పొడిచెత్త, తడిచెత్తకు వేరువేరుగా బుట్టలను పంపిణీ చేశారు.

మహిళా సంఘాల ద్వారా తీర్మానం

సాధారణంగా పన్నుల పెంపుదల తదితర అంశాలేమైనా ఉంటే నగర పాలక సంస్థ కార్యాలయంలో పాలకవర్గ సమావేశంలో చర్చించి తీర్మానం చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం పాలకవర్గమే కాకుండా మహిళా సంఘాల సభ్యులతో అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసి హుటాహుటినా తీర్మానాలు చేయించారు. నెలకు రూ.30నుంచి రూ.60 వసూలు చేయాలని అందులో ఆమోదింపజేశారు. ఇది చూపించి ప్రజలు అంగీకరిస్తున్నారని చూపించి వచ్చే కౌన్సిల్‌లో చెత్తపన్నును ప్రజలపై రుద్దేందుకు సిద్ధపడుతున్నారన్న విమర్శలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పెద్దఎత్తున విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆస్తిపన్నులను ప్రభుత్వం పెంచేసింది. ఇక చెత్త పన్నును ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసేందుకు సిద్ధపడుతుండటం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పన్నుల భారాలను తిప్పికొట్టండి : వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజలపై ప్రభుత్వం మోపుతున్న భారాలను తిప్పికొట్టాలి. అంతటా ఒకేసారి పన్నువేస్తే వ్యతిరేకత వస్తుందని, దశల వారీగా ఒక్కో దగ్గర ఒక్కో రకమైన పద్ధతుల్లో భారం వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనంతపురం నగర పాలక సంస్థలో మహిళా సంఘాల ద్వారా అమలు చేయించే ప్రయత్నం చేయడాన్ని అందరూ వ్యతిరేకించాలి. దీనికి వ్యతిరేకంగా సిపిఎం చేపట్టే ఆందోళనల్లోనూ పాల్గొని తమ వ్యతిరేకతను తెలియజేయాలి.

చిల్లరచేష్టలు చేస్తే చర్యలు



హిందూపురం నియోజకవర్గ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- గ్రూపులను సహించేది లేదు...!
- 'పురం'లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం
- మడకశిరలో అసమ్మతి నేతల నిరసన

ప్రజాశక్తి -హిందూపురం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చిల్లచేష్టలు చేస్తూ గ్రూపు తగాదాలను చేసే వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసిపి శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నియోజకవర్గ సమీక్షా సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన సత్యసాయి జిల్లాల పరిధిలోని మడకశిర, హిందూపురంలో పర్యటించారు. ఉదయం మడకశిరలో, మధ్యాహ్నం హిందూపురంలో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాలలను నిర్వహించారు. ఈ సందర్భంగా అసమ్మతి నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలో నిర్వహించిన సమావేశంలో ఘాటుగానే స్పందించారు. చిల్లర చేష్టలు చేస్తే సహించేది లేదని, పార్టీకి నష్టం చేకూరేలా వ్యవహరిస్తే ఎంతటి వారిపైన అయినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నుంచి అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా వైసిపి నాయకులు కష్టపడి ఆయన గెలుపునకు పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైసిపి ఓడిపోతే తాను జిల్లాలో ఇక అడుగు పెట్టనని స్పష్టం చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి గెలవబోతోందంటూ జోస్యం చెప్పారు. కుప్పంలోనే గెలవబోతుంటే హిందూపురంలో ఎందుకు గెలవలేమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో వైసిపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివద్ధి పనులను ప్రజలకు తీసుకెళ్లాలన్నారు. నాయకులు అంకితభావంతో పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఏపీ ఆగ్రో సంస్థ ఛైర్మన్ నవీన్ నిశ్చల్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు జబివుల్లా, బాలరామిరెడ్డి, నాయకులు మధుమతి రెడ్డితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఈ ఎమ్మెల్యే మాకొద్దు'
మడకశిర అసమ్మతి నేతల నినాదాలు

మడకశిర : మడకశిర వైసిపిలో అసమ్మతి గళం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్ద మరోమారు బహిర్గం అయ్యింది. నియోజకవర్గ సమీక్షా సమావేశంల్లో భాగంగా మడకశిరకు వస్తున్న మంత్రిని కల్లుమరి గ్రామం జాతీయ రహదారి వద్ద మడకశిర వైసిపి అసమ్మతి నేతలు మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ నళిని రంగేగౌడ్, సంగీతం నత్య అకాడమీ డైరెక్టర్ శాలిని సుధాకర్‌తో పాటు పలువురు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఆయన్ను కలిశారు. ఈ సమయంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున 'జగనన్న ముద్దు- మా ఎమ్మెల్యే వద్దు' అంటూ నినాదాలు చేశారు. దీనిపై మంత్రి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, అసమ్మతి పేరుతో పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదన్నారు. 'మీ ఎమ్మెల్యే పని అయిపోయింది.. వదిలేయండి' అంటూ మంత్రి అసమ్మతి నేతలకు ఒక విధమైన సంకేతం ఇచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాండూస్ తుపాను బాధితులను ఆదుకోండి

పరిగి : మాండూస్ తుఫాను వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వ ఆదుకోవాలని నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని బీచిగానిపల్లి గ్రామ దళితులతో కలసి కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్థానిక సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ పంచాయతీలో ఇల్లు లేని దళిత కుటుంబాలు చాలా ఉన్నాయని వచ్చే వర్షాలకు పూరి గుడిసెలు సైతం వర్షం నీరు చేరి ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. మరికొందరికి చెందిన పాతగృహాలు వర్షానికి దెబ్బతిన్నాయన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విఆర్ఒ నరసింహులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి కిరణ్ కుమార్, బీచిగానిపల్లి నరసింహులు, అశోక్ కుమార్, సోమందేపల్లి వెంకటేష్, బీచిగానిపల్లి దళిత కాలనీవాసులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం క్రింద రీ సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ టిఎస్. చేతన్, ఇన్‌ఛార్జి ఆర్డీవో భాగ్యలక్ష్మి, ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన 26 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఏడు గ్రామాలకు సంబంధించి ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ప్రింటింగ్ కూడా వచ్చిందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా ప్రింటింగ్ పక్రియ జరుగుతోందన్నారు. 24 గ్రామాలకు విలేజ్ మ్యాప్‌లు వచ్చాయన్నారు. గ్రౌండ్ టు థింగ్ వేగంగా చేపడతామన్నారు. జనవరి 15 లోపు పూర్తి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీ సర్వేపై ఇప్పటికే జిల్లా మండల క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు.



విడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాశక్తి. పుట్టపర్తి అర్బన్

వామపక్ష పార్టీలు బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డిని, పోతుల నాగరాజును గెలిపించుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు అనుబంధ సంస్థల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజును వామపక్షాలు బలపరుస్తున్నాయన్నారు. వారి విజయం కోసం గట్టిగా కృషి చేయాలన్నారు. అందుకు వామపక్షాలు, అనుబంధ సంస్థల నాయకులు ఉపాధ్యాయ, పట్టుభద్రులు కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. చట్టసభలలో కార్మిక కర్షక పేద వర్గాల తరుపున గట్టిగా తమ వాణిని వినిపించే వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఎస్ఎఫ్ఐ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంచాలి : ఎస్ఎఫ్ఐ

మడకశిర : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్‌లో వయో పరిమితిని సడలించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత ఐదు సంవత్సరాల నుంచి పోలీస్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీ విషయంలో జాప్యం జరుగుతూ వచ్చిందన్నారు. దీంతో ఎంతో మంది నిరుద్యోగులు సంవత్సరాల కొద్దీ పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ కేంద్రాల్లో వేలాది రూపాయలు వెచ్చించారన్నారు. ఇప్పుడు చూస్తే వయసు వయోపరిమితి దాటిపోయిందని నిరాశకు గురికావల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈనేపథ్యంలో మరో ఐదు సంవత్సరాల వరకు వయోపరిమితిని పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్ భరత్, రవి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు ఘన నివాళి



జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



పెనుకొండలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పుట్టపర్తి రూరల్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ తో ఏవో సుజాత అడ్మిన్ ఆర్ ఐ టైటాస్, డిసిఆర్‌బి సిఐ గంటా సుబ్బారావు, ఇతర ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు :ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని గ్రంథాలయ శాఖ అధికారి కె జయరాం తెలిపారు శాఖ గ్రంథాలయంలో గురువారం పొట్టిశ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు మహమ్మద్, వెంకటరమణప్ప, బాబయ్య, ప్రభాకర్, రషీద్, మోహన్, అటెండర్ మునీరు తదితరులు పాల్గొన్నారు

ధర్మవరం టౌన్ : పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక కాలేజ్ సర్కిల్లో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి యువర్సే ఫౌండేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వైకె శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, జయరాం తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా అవోపా ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కలవలరామ్కుమార్, అవోపా జిల్లాఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరి నాగరాజు, అవోపాపట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ధర్మవరం శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి. సిబ్బంది రమణనాయక్.శివమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

పెనుకొండ : అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ వర్ధంతిని పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అల్లుడు పి. శశి భూషణ్ పటేల్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, శశిభూషణ్, మండల కన్వీనర్ సిద్దలింగప్ప, పట్టణ కన్వీనర్ రవిశంకర్, మండల కన్వీనర్ సిద్దయ్య, జిల్లా కార్యాలయ కార్యదర్శి సాయి ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర చౌదరి, ఉప్పర సాధికార రాష్ట్ర సభ్యులు గోపాల్ , నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామలింగ, గోనిపేట సర్పంచి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: స్థానిక మూడు రోడ్ల కూడలిలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పండు, మహబూబ్ బాషా, రాజశేఖర్ అలి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

ఓబుల దేవర చెరువు : స్థానిక బీసీ కాలనీ చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు గఫూర్ భాష ఇంట్లో గురువారం ఏర్పడిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పలు సామగ్రి కాలిపోయింది. ఫ్రిడ్జి, బీరువాతో పాటు బీరువాలోని డబ్బు, బట్టలు, వంట సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. తన భార్య రజియా అనారోగ్యంతో కడప ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం చీటీ ద్వారా వచ్చిన రూ 1,50,000 వేల నగదును బీరువాలో ఉంచామని ఈ ప్రమాదంలో మొత్తం డబ్బులతో పాటు బట్టలు సామాగ్రి కాలిపోయాయని బాధితుడు గఫూర్‌బాషా వాపోయాడు మొత్తం రూ 6. లక్షల వరకు తనకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి హిందూపురం

వేర్వేరు చోట్ల గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి అయ్యాయి. వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హిందూ పురపాలక సంఘ పరిధిలోని కొట్నూరు నుంచి పట్టణంలోకి ద్విచక్ర వాహనంలో వస్తున్న అనిల్, పట్టణంలో నుంచి ద్విచక్ర వాహనంలో కొట్నూరు కు వెళుతున్న మోహన్‌కృష్ణ కొట్నూరు కట్ట వన్నమ్మ ఆలయ సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో అనిల్ తలకు తీవ్ర దెబ్బలు తగిలాయి, మోహన్ కృష్ణ ఎడమ చెయ్యి, ఎడమ కాలుకు ఫ్రాక్చర్ అయింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అనిల్ ను మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. అదేవిధంగా గోరంట్ల సమీపంలో పూలేరు రోడ్డులో కుక్క అడ్డు వచ్చి ఆరీఫ్ అనే యువకుడు ద్విచక్ర వాహనం నుంచి కిందకు పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆరీఫ్ తలకు తీవ్ర గాయాలు అయినాయి. అదేవిధంగా గోరంట్ల పట్టణంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి నరేష్ యువకుడు గాయపడ్డాడు. స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులకు వైద్యులు నరేంద్ర వైద్య సేవలందించారు.

పరామర్శించిన ఎమ్మెల్సీ : రోడ్డు ప్రమాదాల విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చి గాయపడిన వారిని పరామర్శించారు. ఈసందర్భంగా వారికి ఆర్థికసాయాన్ని అందజేశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.



క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మంత్రికి ఘనస్వాగతం

చిలమత్తూరు : హిందూపురం, మడకశిరలలో నిర్వహించే వైసిపి విస్తృతస్థాయి సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకఉ వెళుతున్న రాయలసీమ రీజనల్ కోఆర్డీనేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కొడికొండ చెక్‌పోస్టు వద్ద స్థానిక వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి ఎంపిపి పురుషోత్తమ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

18న సమీక్ష సమావేశం

గాండ్లపెంట : ఈనెల 18న కదిరిలో నిర్వహించే వైసిపి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి జగన్మోహన్ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదిరిలో 18వ తేదీ జరిగే సమీక్ష సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చేపలపెంపకానికి చెరువు వేలం

లేపాక్షి మండలం పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ పరిధిలో గల రెండు చెరువుల్లో చేపలను పెంచడానికి స్థానిక సర్పంచి గంగలక్ష్మమ్మ అధ్యక్షతన వేలంపాటను గురువారం నిర్వహించారు. పెద్ద చెరువును 38వేల రూపాయలకు, చిన్న చెరువును 78వేల రూపాయలకు వ్యాపారులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

17న విస్తృత స్థాయి సమావేశం

సోమందేపల్లి : ఈనెల 17న పెనుకొండలోని మార్కెట్ యార్డ్ లో జరిగే వైసిపి విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతున్నారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు

తలుపుల : మండలంలోని ఎర్రిపల్లికి గ్రామానికి చెందిన గురునాథ్, గంగన్న అనే రైతులకు చెందిన ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ రైతులకు చెందిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షానికి తడిసిపోయింది. ఈ నేపథ్యంలో ఎఒ షాదాబ్, రైతుభరోసాకేంద్రం అధికారి గౌతమి గురువారం బాధిత రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రక్తపరీక్ష సామగ్రి వితరణ

ధర్మవరం టౌన్ : ప్రభుత్వాస్పత్రికి రక్తపరీక్షల పరికరాలు లేకపోవడాన్ని గమనించిన ముదిగుబ్బ మండలానికి చెందిన ఓ దాత రక్తపరీక్షల సామాగ్రిని గురువారం అందజేశారు. ఈ మేరకు ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి గ్రామానికి చెందిన ఉషాభరత్ రూ.10 వేలు విలువ చేసే రక్తపరీక్షల సామాగ్రిని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్, లాబ్ ఇన్‌ఛార్జి గురిగారి జయమ్మ, ల్యాబ్ యూనిట్ సభ్యులు అశోక్‌రెడ్డి, కృష్ణకాంత్, నరసింహులుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా 'చెత్తతో సంపద కేంద్రం'

సోమందేపల్లి : మండల పరిధిలోని చాలకూరు పంచాయతీ కేంద్రంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబులకు నిలయంగా మారింది. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రం అధికారుల నిర్లక్ష్యంతో ఉపయోగంలో లేకుండా పోయింది. ఫలితంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబుల అడ్డాగా, పేకాట స్థావరంగా, వ్యభిచార స్థావరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

కదిరి టౌన్ : ఈనెల 20 నుంచి 22 వరకు అనంతపురంలో నిర్వహించే సిఐటియు అనుబంధం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను స్థానిక నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఐటియు మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జిఎల్. నరసింహులు, లక్ష్మీనారాయణ తదితరులు స్థానిక నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు ప్రజలు వివిధ రంగాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు రమణ, జె. జనార్ధన్, ఎస్. తిరుపాలు, బాలకృష్ణ, చెన్నకృష్ణ, రాజు, కృష్ణకుమార్, రాజేష్, నరసింహ, రామాంజులు. సూరి, నరసింహ మూర్తి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా జట్ల సభ్యులు, తదితరులు

కదిరి టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ అండర్ - 14 జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా సెలక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28, 30న కదిరి పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోటీలకు ఎంపికైన జట్టు సభ్యుల వివరాలను ఆయన వెల్లడించారు.

బాలురజట్టు: జశ్వంత్, విశ్వనాథ్, సాయి కుమార్, వేణుగోపాల్, వినయ్, విశ్వనాథ్, రవి, నిరంజన్, విశాల్ రెడ్డి, జస్వంత్, అహమ్మద్ తఫలాన్, బన్నీ, గంగాధర్, సాయి సందేశ్, సాదిక్, సోమేశ్ కుమార్.

బాలికల జట్టు : అర్చన, పవిత్ర, రాజహంసని, నందిని, సింధూజ, రాధిక, లిఖిత, కల్పన, కావ్య, ఉమానయ్, మెహన్ తాజ్, జ్యోష్ణ, హర్షిని, సమీరా జాస్మిన్, లక్ష్మీ ప్రసన్న, రీనా అప్సన.

వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్ సెక్రటరీ అంజన్న, పీడీలు దనమయ్య, బయరెడ్డి, హరిప్రసాద్, షఫీ, లష్కర్ నాయక్, బాబా ఫక్రుద్దీన్, రెడ్డప్ప, హరూన్, అది నారాయణ, సందీప్, ఆనంద్ రెడ్డి, శివకుమార్, మేనేజర్, కోచ్‌లతో పాటు పాఠశాల హెడ్ మాస్టర్ శాంతమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్‌కె.వలి తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 11,12తేదీల్లో నిర్వహించిన జూడో సెంట్రల్ జోనల్ వెల్(జూడోచాంపియన్స్) పోటీల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు జూడోక్లబ్ కోచ్ ఇనాయత్‌బాషా తెలిపారు. వివిధ వెయిట్ క్యాటగిరిలో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభ చూ పారన్నారు.30కేజీల విభాగంలో యేసురాజు, 55 కేజీల విభాగంలో రియాజ్ అహమ్మద్ ప్రతిభ కనపర్చి బంగారుపతకాలు సాధించారన్నారు. 57కేజీల విభాగంలో బేబి, 40కేజీల విభాగంలో ఇర్షాద్ , 45 కేజీల విభాగంలో రియాన్‌అహమ్మద్ బ్రాంచ్ మెడల్స్ సాధించారన్నారు. జూడో స్టేట్ సిఇఒ బాబు, జూడోకోచ్‌లు రాజశేఖర్, పురుషోత్తం, ఆర్డీటీ కోచ్ మురళీకృష్ణ చేతులమీదుగా వీరు పతకాలు అందుకున్నారని ఇనాయత్ బాషా తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదలొద్దు

ధర్మవరం టౌన్ : మున్సిపాలిటీలో ప్రధాన రహదారుల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తూ వాహనదారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నాయని పశువుల పెంపకందారులు వాటిని ఇళ్లవద్దనే కట్టడి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్లపై పశువులు సంచరిస్తూ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేలా చేస్తున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు పశువులను గోశాలకు తరలించేందుకు కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. ఈనెల 8వ తేదీలోగా పశువుల పెంపకం దారులు తమ పశువులను ఇళ్లవద్దనే కట్టడి చేసుకోకపోతే యజమానులపై జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పార్టీ అభివృద్ధికి కలసికట్టుగా పనిచేయండి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి మడకశిర

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంచుకున్న లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ప్రతి నాయకుడు కార్యకర్త కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో మడకశిర నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు శంకర్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 2024లో జరిగే ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి కూడా అమలు చేయని సంక్షేమ పథకాలు 98.4శాతం అమలు చేసి అన్ని రాష్ట్రాలకు మార్గదర్శంగా జగన్ నిలిచాడన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ లోటుపాట్లు ఉంటాయని వాటిని ప్రత్యేకంగా చూపించి పార్టీని దెబ్బతీయడానికి ప్రయత్నించరాదని హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర నాయకత్వాన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశాలు ముగిసిన తరువాత ప్రతి నియోజకవర్గ పరిశీలకుడు ప్రతి మండలంలోని పర్యటించి కార్యకర్తల ప్రజల సమస్యలను తెలుసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ శాసనసభ్యుడు వైటి ప్రభాకర్ రెడ్డి, మాజీమంత్రి నర్సే గౌడు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డి తదితరులు ప్రసంగించారు. వైసిపిని మరోమారు అధికారంలోకి తేవటానికి ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గం పరిశీలకుడు అశోక్ కుమార్, ఇక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని రంగే గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17న వాహనాల వేలం

అమడగూరు : వివిధ కేసుల్లో పట్టుబడిన 39 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐఐ వెంకటనారాయణ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రెండు వేల రూపాయలు డిపాజిట్ కట్టాలన్నారు. అలాగే వాహనం వేలంపాటలో దక్కించుకున్న తరువాత వేలంపాట పడిన డబ్బులతో పాటు జిఎస్టీ డబ్బులు కూడా చెల్లించాల్సుంటుందని చెప్పారు.

పంచాయతీ అక్రమాలపై విచారణ

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ బాలాజీ గురువారం విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఉపసర్పంచి, వార్డు మెంబర్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల్లో విచారణ కార్యక్రమాన్ని పూర్తి చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. పంచాయతీలో ప్రతి మూడు నెలలకు ఒకసారి వార్డు మెంబర్లతో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఎన్నిక అయినప్పటి నుండి సమావేశాలు నిర్వహించినట్లు రికార్డుల్లో పొందుపరిచిన దాఖలు లేవన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నాయకులు

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం : టిడిపి



పుట్టపర్తిలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి



కదిరిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ పాలనకు చమర గీతం పాడే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగర పంచాయతీలోని కర్ణాటక నాగేపల్లిలో నిర్వహించిన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి ఈనే కార్యక్రమంలో పాల్గొన్న పల్లె మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని అన్నారు. గట్టిగా నిలదీసిన నాయకులను పోలీసుల ద్వారా అరెస్టు చేస్తున్నారన్నారు. మూడున్నర ఏళ్ల పాలనలో ప్రభుత్వ పాలన చూస్తూ ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ అరాచక దౌర్జన్య పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని 2024 ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, పార్లమెంటు పార్టీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, అంబులెన్స్ రమేష్, మాల మనోహర్, కరణం సుబ్రహ్మణ్యం, రాజప్ప, శ్రీరాములు, రమేష్, తెలుగు మహిళా నాయకురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం పెరిగిందని 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి చంద్రకళ అన్నారు. గురువారం స్థానిక 19వ వార్డులో వార్డు ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో బాలయ్య అభిమానులు ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. వైసిపి దోచుకోవడం దాచుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు.

కదిరి టౌన్ : వైసిపి పాలనలో ప్రగల్భాలు తప్ప అభివృద్ధి శూన్యమని టిడిపి నాయకులు మోపురిశెట్టి చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ విమర్శించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్నిరూరల్ మండలం సున్నపుగుట్ట తండా, పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ 11 వ వార్డులో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ బాబు మాట్లాడుతూ వైపిపి ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోవటం లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, మహేంద్ర, విశ్వనాథ్, ప్రకాష్, చాంద్‌భాషా, ఖాదర్‌బాషా, కతాబలి ఖాన్, సులేమాన్, సిరాజ్, గంగరత్నమ్మ, శారద, బాజాన్, శవాజ్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయితీ లోని మైరాడ, చిన్నన్నవారిపల్లి, కాయలపల్లి, చిన్నన్నవారిపల్లి దళిత కాలనీల్లో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, పల్లపు రామాంజనేయులు, జయచంద్ర. శ్యామ్ సుందర్ రెడ్డి, రామామంజులు తదితరులు పాల్గొన్నారు.